నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 17 జనవరి 2025 | SIDDIPET

కేటీఆర్‌కు శేరి సుభాష్‌రెడ్డి సంఘీభావం

ఈడీ విచారణ అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

వర్గల్, జనవరి 16: జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయం 2025-26 విద్యా సంవత్సరంలో 80 సీట్లకు నిర్వహించే ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న అర్హత పరీక్ష శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు వర్గల్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ దాస రాజేందర్ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 12 కేంద్రాల్లో 2,626 మంది విద్యార్థులు, మెదక్ జిల్లాలో 8 కేంద్రాల్లో 1589 విద్యార్థులు, సిద్దిపేట జిల్లాలో 10 కేంద్రాల్లో 2,250 మంది పరీక్ష రాయనున్నారు. మొత్తం ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాల్లో 6,465 మంది బాలబాలికలు అర్హత పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్లో హాల్ టికెట్లను నవోదయ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడు చేసుకోవాలని, ఆయా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే హాజరుకావాలని ప్రిన్సిపాల్ దాస రాజేందర్ సూచించారు.

హామీల అమలు చేతకాక అక్రమ కేసులు



నర్సాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న కాంగ్రెస్
- వేధించడానికే కేటీఆర్‌పై అక్రమ కేసులు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ధ్వజం

నర్సాపూర్, జనవరి 16: ఆరు గ్యారంటీలు, ఇచ్చిన అనేక హామీలపై ఎక్కడ ప్రజలు ప్రశ్నిస్తారో అనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌పై అన్యాయంగా, అక్రమంగా ఫార్ములా ఈ-రేసింగ్ కేసు పెట్టారని ఆరోపించారు. చంద్రబాబు 1992లో ఈ కార్ రేసింగ్‌ను రాష్ట్రానికి తీసుకురావాలని శతవిధాలా ప్రయత్నం చేసి విఫలమయ్యారని, కానీ.. కేటీఆర్ కృషితో ఈ-రేసింగ్ కేసు పోటీలకు హైదరాబాద్ వేదిక అయ్యిందన్నారు. రేస్ నిర్వహణతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరగడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్రానికి రూ. 700 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చి 13 నెలల తర్వాత కావాలనే ఫార్ములా ఈ-రేసింగ్ ప్రాసెస్‌ని తప్పుగా చూపించి కేటీఆర్‌పైన కేసును బనాయించిందన్నారు. ఇందులో రూ.55 కోట్లు ప్రభుత్వం పరంగా ఇచ్చామని అధికారులే చెబుతున్నారని, అక్కడ నిర్వాహకులు కూడా ప్రభుత్వం నుంచి తమకు డబ్బులు అందాయని స్పష్టంగా చెప్పారని, ఇందులో ఎక్కడ అవినీతి ఉందని ప్రశ్నించారు. మళ్లీ ఈ-రేసింగ్ నిర్వహిస్తామని అప్పటి సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ఒప్పందాన్ని రద్దు చేసి తెలంగాణకు చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరించిందని విమర్శించారు. ఈవెంట్ రద్దుతో రాష్ట్ర ఇమేజ్ ప్రపంచవ్యాప్తంగా దెబ్బతినేలా, పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి రావాలంటేనే భయపడేలా వాతావరణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిందని సునీతా లక్ష్మారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిందని, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయూమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, సంతోష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాబ్యానాయక్, బీఆర్ఎస్ నర్సాపూర్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు రాంచందర్, ఆంజనేయులుగౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొందరికే ఆత్మీయ భరోసా!

- 20రోజుల పనిదినాలు పూర్తి చేసుకుంది 94,454 కుటుంబాలు
- భూమి ఉన్న వ్యవసాయ కూలీల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం
- 40శాతం మందికి గుంటకు పైగా భూమి ఉన్నట్లు అంచనా
- 29వేల మందికి మాత్రమే ఆత్మీయభరోసా వర్తించే అవకాశం
- రెండు విడతల్లో రూ.12వేలు జమ చేయనున్న ప్రభుత్వం
- ప్రభుత్వం తీరుపై వ్యవసాయకూలీల ఆగ్రహం
- నిబంధనలతో మోసగిస్తున్నదని ఆవేదన

30శాతం మందికే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' వర్తింపు



సంగారెడ్డి జిల్లా కంది మండలంలో సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు

సంగారెడ్డి, జనవరి 16(నమస్తే తెలంగాణ): 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పుతున్నది. ఎన్నికలకు ముందు వ్యవసాయ కూలీలందరికీ రూ. 12వేల ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చింది. తీరా ఇప్పుడు కోతలకు పాల్పడుతున్నది. ప్రభుత్వ చర్యతో సంగారెడ్డి జిల్లాలోని వ్యవసాయకూలీలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి దూరం అవుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో కేవలం 30శాతం మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం తీరుపై వ్యవసాయ కూలీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పి ఇప్పుడు తమను మోసం చేస్తున్నదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీ కుటుంబాలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం' కింద రూ.12వేలు ఆర్థిక సాయం అందజేయనున్నది. రెండు విడతలుగా ఈ ఆర్థిక సాయం అందజేయనున్నది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందరికీ వర్తింపజేయకుండా కోతలు విధిస్తూ కేవలం భూమిలేని కూలీలకు, 20రోజుల ఈజీఎస్ పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలకు మాత్రమే పథకం వర్తింపజేస్తామని నిబంధనలు విధించింది. ఈ నిబంధనలతో జిల్లాలోని వ్యవసాయ కూలీలకు తీవ్ర అన్యాయం జరగనున్నది. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సంగారెడ్డి జిల్లాలో కేవలం 30శాతం మందికి అంటే 29వేల మందికి మాత్రమే ఈ పథకం వర్తించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పథకం అమలులో భాగంగా ఇప్పటికే 20 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న వ్యవసాయ కుటుంబాలను గుర్తించారు. ఆధార్ సీడింగ్ పూర్తిచేశారు. 20 పనిదినాలు పూర్తి చేసుకున్న వ్యవసాయ కుటుంబాల్లో వ్యవసాయభూమి ఉన్న కూలీల గుర్తింపు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. రెండురోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అనంతరం గ్రామసభలు నిర్వహించి పథకం అర్హుల గుర్తింపు, ప్రకటన ఉంటుంది. 26వ తేదీ నుంచి అర్హులైన లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.6వేలు ఖాతాల్లో జమచేస్తారు.

నిబంధనలతో చాలామంది దూరం..

సంగారెడ్డి జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీకి వెళ్లి పొట్టపోసుకునే వ్యవసాయ కూలీల సంఖ్య ఎక్కువగా ఉంది. జిల్లాలో 2,18,600 ఈజీఎస్ కార్డులు ఉన్నాయి. 4,01,726 మంది వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు. అనారోగ్యం, ఇతరత్రా కారణాలతో కూలీలు వరుసగా ఈజీఎస్ పథకంలో పనిచేయరు. ఇలా పని చేయని వారిని ఈజీఎస్ అధికారులు గుర్తించి నాన్‌యాక్టీవ్ వర్కర్స్‌గా పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రతిరోజు పనికి వచ్చే కూలీలను అధికారులు గుర్తించి వారికి కూలీ చెల్లింపులు చేస్తారు. సంగారెడ్డి జిల్లాలో 1,31,104 జాబ్‌కార్డులపై 2,23,769 మంది యాక్టీవ్ కూలీలు ఉన్నారు. ఇందులో యాక్టీవ్ ఎస్సీ కూలీలు 70,052, ఎస్టీ కూలీలు 31,238, ఇతరులు 1,22,479 మంది ఉన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రతి వ్యవసాయ కూలీకి ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఇప్పుడు మాట తప్పి సెంటుభూమి ఉన్న వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా పథకం ఇవ్వమని నిబంధన విధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20కంటే ఎక్కువ ఈజీఎస్ పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లో ఒకరికి మాత్రమే ఇందిర్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేస్తామని చెబుతున్నది. ప్రభుత్వ నిబంధనల కారణంగా జిల్లాలో కేవలం 30శాతం మందికి మాత్రమే ఇందిరమ్మ భరోసా పథకం వర్తించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 1,31,104 జీఎస్ యాక్టీవ్ కార్డులు ఉండగా, ఇందులో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20రోజులకు పైగా పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలను ఈజీఎస్ అధికారులు గుర్తించారు. యాక్టీవ్ కూలీ కుటుంబాలు 94,454 ఉన్నాయి. యాక్టీవ్ జాబ్‌కార్డులు ఉన్న వ్యవసాయ కుటుంబాలతో పోలిస్తే 72శాతం మంది మాత్రమే 20 రోజులకు పైగా పనిదినాలు పూర్తి చేసుకున్నారు. వీరిలో వ్యవసాయ భూమి ఉన్న కూలీల గుర్తించాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఈజీఎస్ అధికారులు తమ వద్ద ఉన్న 94,454 మంది వ్యవసాయకూలీల వివరాలను రెవెన్యూ అధికారులకు అందజేశారు. రెవెన్యూ అధికారులు 94,454 వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఎంతమందికి భూమి ఉన్నది గుర్తిస్తున్నారు. అధికారుల సమాచారం మేరకు 94,454 వ్యవసాయ కుటుంబాల్లో 40 శాతం మందికి కనీసం సెంటు భూమి ఉన్నట్లు సమాచారం. దీంతో 20 పనిదినాలు పూర్తి చేసుకున్న వారిలో 30 శాతం మంది కూలీలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే అవకాశాలు ఉన్నాయి. కుటుంబానికి ఒకరి చొప్పున లెక్కిస్తే సంగారెడ్డి జిల్లాలో 29వేల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధి చేకూరే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో జిల్లాలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వ్యవసాయ కూలీలకు నష్టం జరుగుతున్నది. ఉపాధి హామీ పథకంలో కూలీకి వెళ్లి పొట్టపోసుకునేది ఎక్కువగా పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యవసాయ కూలీలే.

ఫిబ్రవరి 9న లక్ష సూర్య నమస్కారాల ప్రదర్శన

పోస్టర్ ఆవిష్కరించిన సిద్దిపేట కలెక్టర్

సిద్దిపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, జనవరి 16: శత సహస్ర సూర్య నమస్కారాల యోగా ప్రదర్శన, రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీల పోస్టర్‌ను సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి గురువారం సాయంత్రం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. సిద్దిపేట బాలికల ఉన్నత పాఠశాల మినీ స్టేడియంలో వచ్చేనెల ఫిబ్రవరి 9న ఉదయం 6 గంటలకు 1000 మంది యోగా సాధకులచే లక్ష సూర్య నమస్కారాల ప్రదర్శన ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఈ ప్రదర్శనను ప్రత్యక్షంగా వీక్షించి రికార్డులోకి నమోదు చేస్తారని చెప్పారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రథ సప్తమిని పురస్కరించుకొని ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఇదే సందర్భంలో రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీ జరుగుతుందని తెలిపారు. 25 ఏండ్లలోపు వారికి, 25ఏండ్ల పైన వారికి వేరువేరుగా పోటీలు ఉంటాయన్నారు. మహిళలకు, పురుషులకు నాలుగు విభాగాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని ప్రకటించారు. లక్ష సూర్య నమస్కారాల ప్రదర్శనలో పాల్గొని వారందరికీ సర్టిఫికెట్, మెడల్ అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ఉపాధ్యక్షుడు కోమాండ్ల విక్రం రెడ్డి, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, ప్రముఖ యోగా శిక్షకుడు తోట సతీష్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, యోగా చీఫ్ ప్యాట్రన్ చిప్ప ప్రభాకర్, యోగా సభ్యులు సురేశ్, రాజ్ కుమార్, దేవదాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన గ్రామస్తులు

- అధికారుల సర్వేలో తమ పేర్లు లేవంటూ గ్రామస్తుల ఆందోళన
- అధికారులను నిలదీసిన నంగునూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు

పాలమాకులలో అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

నంగునూరు, జనవరి 16: అధికారుల సర్వేలో తమ పేర్లు రాలేదని, దీంతో రేషన్ కార్డులు రావేమోనని పాలమాకులకు చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులు రాక ఇబ్బందులు పడుతున్నామని, అధికారుల తప్పిదంతో సర్వే లిస్టులో తమ పేర్లు గల్లంతయ్యాయని పాలమాకుల గ్రామస్తులు అధికారులను నిలదీశారు. నంగునూరు మండలంలోని నంగునూరు, పాలమాకుల, గట్లమల్యాల, సంతోష్‌నగర్, కోనాయిపల్లి గ్రామాల్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు గురువారం సర్వే నిర్వహించారు. పాలమాకులలో తహసీల్దార్ సరిత అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటా సర్వే చేపట్టారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న తమ పేర్లు జాబితాలో ఎందుకు లేవని ప్రజలు ప్రశ్నించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితా ప్రకారం సర్వే చేస్తున్నామని తహసీల్దార్ వారికి సమాధానం ఇచ్చారు. సుమారుగా 900 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, పూర్తి జాబితా వచ్చేవరకు సర్వే చేయవద్దని కోరారు. సర్వేను అడ్డుకోవద్దని చెప్పినా వారు వినకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. గ్రామస్తుల వినతి మేరకు తహసీల్దార్ సరిత, జిల్లా కలెక్టర్‌కు, డిస్ట్రిక్ సివిల్ సప్లై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య వివరించారు. వారి సూచన మేరకు గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నంగునూరు, కోనాయిపల్లిలో కొత్త రేషన్‌కార్డు సర్వేలో తమ పేర్లు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కంకర తేలి అధ్వానంగా మారిన వీరానగర్ గ్రామ రోడ్డు

బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో..

అవస్థలు పడుతున్న వీరానగర్ గ్రామస్తులు, ప్రయాణికులు

రాయపోల్, జనవరి 16: ప్రభుత్వాలు మారినా, ఎంతమంది అధికారులు వచ్చినా రాయపోల్ మండలంలోని వీరానగర్ బీటీ రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు. బీటీ రోడ్డుగా మట్టిగా మారి కంకంర తేలడంతో ప్రయాణానికి వాహనదారులు, ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. గజ్వేల్ పీడబ్ల్యూ రోడ్డు నుంచి వీరానగర్ వరకు సమైక్య రాష్ట్రంలో బీటీ రోడ్డు మంజూరైనా కార్యరూపం దాల్చలేదు.తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత దివంగత దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వీరానగర్ గ్రామానికి బీటీ రోడ్డు వేయించారు. ఆ తర్వాత ఈ రోడ్డుపై భారీ టిప్పర్లు, లారీలు నిత్యం తిరగడంతో కొన్నేండ్లలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డు దెబ్బతిని ఏండ్లు గడుస్తున్నా పట్టించునే వారు కరువయ్యారు. వీరానగర్ పరిసర ప్రాంతాల్లో మల్లన్నసాగర్ జలాశయంతో పాటు రైస్ మిల్లులు ఉండడంతో అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పాటు ఈ రోడ్డు మీదుగానే వీరారెడ్డిపల్లి వీదుగా వడ్డేపల్లికి నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుండడంతో బీటీ రోడ్డు దెబ్బతిని మళ్లీ కంకర రోడ్డుగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వీరానగర్ రోడ్డును బీటీగా మారిస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేయాలి..

గజ్వేల్-చేగుంట రోడ్డు నుంచి వీరానగర్ వరకు కంకర తేలిన రోడ్డును మళ్లీ బీటీగా అభివృద్ధి చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది. గతంలో బీటీ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం గుంతలు, కంకర తేలి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని అనేకసార్లు నాయకులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పనిచేయడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని బీటీగా మార్చి ఇబ్బందులు తొలిగించాలి.

– ఉప్పరి స్వామి, వీరానగర్

భానుప్రకాశ్‌కు 'ధార్మిక సేవా' పురస్కారం

అవుసుల భానుప్రకాశ్

మెదక్, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : ఆధ్యాత్మిక, ధార్మిక, సాహిత్య సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఏటా అందించే విజయదుర్గా ధార్మిక సేవా పురస్కారం-2025కు మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలం బూరుగుపల్లికి చెందిన యువ అవధాని, సాహితీవేత్త, వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణులు అవుసుల భానుప్రకాశ్ ఎంపికయ్యారు. ఆయన పురస్కారం అందించనున్నట్లు విజయదుర్గా మాత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చెప్పెల హరినాథశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో జరిగే విజయదుర్గా పీఠాధిపతులు వెదురుపాక గాడ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ పురస్కారం ప్రదానం చేస్తాయని తెలిపారు.వృత్తిరీత్యా తెలుగు పండితుడిగా పనిచేస్తున్న భానుప్రకాశ్ ఇప్పటి వరకు 40కి పైగా అష్టావధానాలను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా యువతను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నారు. పద్య, గేయ, వచన కవితా ప్రక్రియల్లో 25కు పైగా వైవిధ్యభరితమైన రచనలు అందించారు.

- కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో ముమ్మర తనిఖీలు
- దుండగుల కోసం గాలిస్తున్న పోలీసులు

ఉలిక్కిపడ్డ బార్డర్

బీదర్ ఘటనతో ఇరురాష్ట్రాల పోలీసుల అప్రమత్తం

న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న హద్నూర్ పోలీసులు

కర్ణాటకలోని బీదర్‌లో దుండగుల దాడిలో మృతిచెందిన సీఎంఎస్ ఉద్యోగి

జహీరాబాద్, జనవరి 16: సంగారెడ్డి జిల్లా సరిహద్దు రాష్ట్రం కర్ణాటకలోని బీదర్ జిల్లాకేంద్రంలో గురువారం పట్టపగలు ఇద్దరు దుండగులు సీఎంఎస్ సిబ్బందిపై జరిపిన కాల్పుల ఘటనలో ఒకరు మృతిచెందడం, ముగ్గురు గాయపడడం సంచలనంగా మారింది. ఈ ఘటనతో ఒక్కసారిగా ఇరు రాష్ట్రాల పోలీసులు అలర్ట్ అయ్యారు. బీదర్‌లోని శివాజీ సర్కిల్‌లోని జిల్లాకోర్టు సమీపంలోని బ్యాంకు నుంచి డబ్బులను తీసుకుని సీఎంఎస్ సిబ్బంది తమ వాహనంలో ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు పెట్టేందుకు అక్కడికి చేరుకున్నారు. ఇద్దరు దుండగులు తలకు హెల్మెట్లు ధరించి బైక్‌పై వచ్చి సెక్యూరిటీతో పాటు డ్రైవర్ ముఖాలపై కారం పొడర్‌ను చల్లారు. మరో ఇద్దరు సిబ్బంది ఏటీఎంలో డబ్బులు పెట్టేందుకు వాహనంలోని డబ్బులు భద్రపరిచిన పెట్టెను తీసుకెళ్తుండగా, దుండగులు విచక్షరహితంగా ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది ఒకరు వాహనం వెనక అక్కడికక్కడే మృతిచెందాడు. మరొక సిబ్బందిపై దుండగులు ఛాతిలో కాల్చడంతో స్పృహ తప్పిపోయాడు. వందలాది మంది ప్రజలు చూస్తుండగానే డబ్బులు భద్రపర్చిన పెట్టెను తీసుకుని దుండగులు బైక్‌పై పారిపోయారు. అక్కడే ఉన్న కొందరు వారిని రాళ్లతో కొట్టేందుకు ప్రయత్నించగా దుండగులు పిస్టల్‌తో బెదిరించడంతో పట్టుకునేందుకు ఎవరూ సాహసించలేదు. ఈ ఘటనలో కోటి రూపాయల వరకు డబ్బులు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా తెలిసింది. దుండగుల కాల్పుల్లో తీవ్రగాయాలైన సిబ్బందిని బీదర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇందులో పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కేర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఒకరు మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా పోలీసు అధికారులు హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దుండగుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి గాలింపులో నిమగ్నమయ్యాయి. బీదర్ సరిహద్దున కర్ణాటక-తెలంగాణ సరిహద్దుల్లో కర్ణాటక నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కర్ణాటక పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ నేతృత్వంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. చిరాగ్‌పల్లి, హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని మాడ్గి, గణేశ్‌పూర్, చెక్‌పోస్టులతో పాటు జహీరాబాద్ పట్టణ సమీపంలోని ఆల్గోల్‌బైపాస్, దిగ్వాల్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి ప్రాంతంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తున్నారు.

మోడల్ రైతుబజార్

సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామం నుంచి తొగుట వెళ్లే మార్గంలో రోడ్డుపైన రైతులు కూరగాయలు అమ్ముతుండడం చూసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు వారికోసం ప్రత్యేకంగా మార్కెట్ ఏర్పాటు చేయించారు. కానీ, ఆ మార్కెట్ నిర్వహణలో లేక పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు ఈ మార్కెట్ నిర్వహణను విస్మరించారు. దీంతో మో'డల్' రైతుబజార్‌గా మారింది.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, జనవరి 16

తడకపల్లిలోని మోడల్ రైతు బజార్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు

తడకపల్లి గ్రామంలో నిరుపయోగంగా రైతు బజార్